క్లుప్తంగా

చేపపిల్లల పంపిణీ



పంపిణీ చేస్తున్న అధికారులు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని చెరువుల్లో విడుదల చేసేందుకు బుధవారం చేపపిల్లలు పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మత్స్య సహకార సంఘం సభ్యులకు మత్స్య శాఖ జిల్లా అధికారి ఇంతియాజ్ అహ్మద్ ఖాన్, ఎంపీడీఓ జి.రవీంద్రరావు, తహసీల్దార్ కె.నాగభవానీ చేపపిల్లలు అందజేశారు. మండలంలో 31 చెరువులు, కుంటలకు గాను 2,43,750 చేపపిల్లలు అందజేసినట్లు తెలిపారు. ఎంపీఓ జేఎల్.గాంధీ, వెటర్నరీ డాక్టర్ వేమూరి సంతోష్, కోటేశ్వర్ రావు, అనిల్, సొసైటీల బాధ్యులు పాల్గొన్నారు. కాగా, జూలైలో ఇవ్వాల్సిన చేపపిల్లలను ఇప్పుడు ఇస్తే ఫలితం ఉండదని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

హామీలు అమలు చేయాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పాల్వంచరూరల్: ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సంఘం అధ్యక్షుడు ఉప్పరబోయిన రామ్మూర్తి డిప్యూటీ తహసీల్దార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని, రుణమాఫీని పూర్తిస్థాయిలో అమలు చేసి పెట్టుబడి సాయం డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేలంపాట వాయిదా

పాల్వంచరూరల్: వేలంపాటకు పాటదారులు ఎవరు రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి చెందిన కొత్త కాంప్లెక్స్‌లోని 4వ నంబర్ వ్యాపార దుకాణానికి మూడు సంవత్సరాల కాలపరిమితికి లైసెన్స్ లీజు హక్కుల పొందేందుకు, దేవస్థానం పొగుచేసిన చీరలు అమ్మకం, పాత కాంప్లెక్స్‌లోని 1 నంబర్ షాపులోని బల్లలు, బొమ్మలు, ఇతర వస్తువుల అమ్మకమునకు గాను బుధవారం నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలంపాటకు ఎవరూ రాకపోవడంతో వేలంపాటను వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. శివాలయం ఎదుట గల మూడు షెట్టర్ గదుల తొలగింపునకు రూ.65వేలకు పాటదారునికి ఇచ్చినట్లు తెలిపారు.

మునగ సాగుతో రైతులకు లాభం

జూలూరుపాడు: మునగ సాగు సన్న, చిన్నకారు రైతులకు లాభదాయకమని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తాళ్లూరి రవి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వాణిజ్య, ఆహారధాన్య, ఉద్యాన పంటలు సాగు చేసే రైతులకు నికర ఆదాయం ఎకరానికి రూ.20,000 కంటే తక్కువగా ఉంటుందన్నారు. రైతుల ఆదాయాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఎన్ఆర్ఈజీఎస్, ఐకేపీల ద్వారా సన్న, చిన్నకారు రైతులను గుర్తించి మునగ సాగుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. మునగ సాగు చేయడం వల్ల కేవలం కాయలు అమ్మకం ద్వారానే కాకుండా ఆకుల నుంచి పొడి, గింజల నుంచి నూనె తయారు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. పత్తి, మొక్కజొన్న బదులుగా రైతులు ఆయిల్ పామ్ తోటలలో అంతరపంటగా మునగ సాగు చేసుకోవచ్చన్నారు. విత్తనాలు, మొక్కల పరిశీలన, సంరక్షణ, కూలీల ఖర్చులు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఉచితంగా పొందవచ్చని చెప్పారు. మునగ మొక్కలు నాటిన ఆరు నెలల తరువాత నుంచి పంట దిగుబడి వస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



నిరసన తెలుపుతున్న గోప్యా తండావాసులు

టేకులపల్లి: చంద్రుతండా పంచాయతీ రాజుతండా వయా గోప్యాతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు అధ్వానంగా ఉన్న రోడ్డుపై బుధవారం గ్రామస్తులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రూ.1.60 కోట్లతో గత ప్రభుత్వంలో రోడ్డు మంజూరైందని, రెండేళ్ల క్రితం శంకుస్థాపన కూడా చేయడం జరిగిందన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నేటికీ పనులు ప్రారంభించకపోగా రాజు తండా, గోప్యా తండాల్లో రోడ్లపై నీరు నిలిచి ప్రజలు అవస్థలు పడుతున్నారని, కనీసం అంబులెన్స్ కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని వాపోయారు.

వైకుంఠధామంలో టేకు చెట్లు మాయం

- నిద్రావస్థలో అటవీ అధికారులు
- కనీసం వాచ్‌మెన్‌ను కూడా నియమించని వైనం



రామవరంలోని వైకుంఠధామం



నరికిన టేకు చెట్టు మొదలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీలోని కొత్తగూడెం రామవరాన్ని అనుసంధానం చేసే గోధుమవాగు బ్రిడ్జి పక్కన నూతనంగా నిర్మించిన వైకుంఠధామంలోని టేకు చెట్లను దుండగులు కొట్టుకుని ఎత్తుకెళ్తున్నారు. నెలరోజులుగా గేటు తాళాన్ని పగులగొట్టి, వారానికో మూడు, నాలుగు పెద్దపెద్ద చెట్లను ఎంచుకొని కొట్టుకెళ్తున్నా.. జిల్లా హెడ్ క్వార్టర్లలో వివిధ డివిజన్లలో పనిచేస్తున్న ఫారెస్ట్ అధికారులు పట్టించుకోవడం లేదు. పట్టణ ప్రజల సౌకర్యార్థం గోధుమవాగు వద్ద.. రామవరంలో ఆరువార్డులకు గోధుమ వాగు ఇవతల (కొత్తగూడెం) వైపు ఉన్న మరో ఆరు వార్డులు సుమారు 30 వేల మందికి ఉపయోగపడే విధంగా సుమారు రూ.కోటి ఖర్చుతో వైకుంఠధామం ఏర్పాటు చేశారు. అయితే ఇది నేటికీ వినియోగంలోకి రాలేదు. అక్కడ కనీసం వాచ్‌మెన్‌ను కూడా ఏర్పాటు చేయకపోవడంతో విలువైన టేకు చెట్లు దొంగలపాలవుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ వైకుంఠధామం ఏర్పాటుకు ముందే సింగరేణి ఆధ్వర్యంలో రూ.లక్షలు ఖర్చు చేసి టేకు మొక్కలను నాటారు. వాటిని తొలగించకుండా జాగ్రత్తగా వైకుంఠధామానికి అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేశారు. అంతిమ క్రియలకు వచ్చేవారికి నీడనివ్వాలనే ఉద్దేశంతో మున్సిపల్ శాఖ టేకుల చెట్లను రక్షిస్తూ నిర్మాణం చేపట్టారు. వైకుంఠధామం నిర్మాణం పూర్తై సుమారు రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ అక్కడ పూర్తిస్థాయిలో వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాల్సిన మున్సిపల్ శాఖ నిర్లక్ష్యం కారణంగా ఇంక కాలం పెరుగుతున్న విలువైన టేకు చెట్లు దొంగల పాలవుతున్నాయి. ఇంత ఖర్చు చేసి నిర్మించిన వైకుంఠధామాన్ని ఉపయోగంలోకి తేకపోవడంతో పట్టణ ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

పర్యావరణానికి తూట్లు....

పర్యావరణాన్ని కాపాడాలని, పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ (పుట్టిన బిడ్డ), అమ్మ పేరు మీద కూడా మొక్కలు నాటాలని, అవసరమైతే రోజుకు ఒక మొక్క నాటాలని, ప్రభుత్వం, పర్యావరణ ప్రేమికులు, స్వచ్ఛంద సంస్థలు, విస్తృత ప్రచారం చేస్తే ఏదో ఒకచోట మొక్కలను నాటుతున్న ఈ రోజుల్లో..

పట్టణ నడిబొడ్డున ఏపుగా పెరుగుతున్న టేకు చెట్లను కొట్టుకెళ్తుంటే డిపార్ట్‌మెంట్ ఏం చేస్తోందని, దీని వెనక ప్రజాప్రతినిధుల హస్తం ఉండే ఉంటుందని పట్టణ ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత సిబ్బంది దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

శాంతిభద్రతలను పరిరక్షిస్తాం..



విద్యార్థులకు వివరిస్తున్న పోలీసులు

కొత్తగూడెంఅర్బన్: నిత్యం పోలీసు శాఖ శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలకు అండగా ఉంటుందని కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలలో భాగంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం త్రీటౌన్ పోలీసు స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఆన్‌లైన్ ఓపెన్ హౌస్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పాఠశాలల్లోని విద్యార్థులకు, పోలీస్ శాఖలో వినియోగిస్తున్న ఆయుధాలు, బాంబు డిస్పోజల్ సామగ్రి, పోలీస్ జాగిలాల ప్రదర్శన గురించి కూడా వివరించారు. కార్యక్రమంలో కొంతమంది విద్యార్థులు ప్రత్యక్షంగా ఓపెన్ హౌస్‌ను వీక్షించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ అమర వీరులను స్మరించుకుంటూ చేస్తున్న ఈ కార్యక్రమాల ద్వారా పోలీస్ శాఖ పనితీరు ప్రజలకు, విద్యార్థులకు తెలిసే విధంగా ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణకై పోలీసులు నిత్యం విధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. త్రీటౌన్ సీఐ శివప్రసాద్, వన్‌టౌన్ సీఐ కరుణాకర్, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు పాల్గొన్నారు.

స్థానిక సమరంలో గెలవాలి..



టేకులపల్లి: గోలియా తండాలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి తీరాలని ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. ఎంపీటీసీలు, గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఇప్పటినుంచే దృష్టి సారించాలని తెలిపారు. ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమైన ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలు అర్హులందరికీ అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీని బలోపేతం చేయాలని, తద్వారా విజయం సులువవుతుందని చెప్పారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పులి సైదులు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు చీమల నాగరత్నమ్మ, మండల రాము, మెట్టెల కృష్ణ, ఆరెం కిరణ్, ఎట్టి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం..

ఇల్లెందురూరల్/టేకులపల్లి: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతీ పల్లెలో మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఇల్లెందు మండలం మామిడిగూడెం గ్రామపంచాయతీ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి వెంకటాపురం వరకు రూ.30లక్షల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డు, రేపల్లెవాడ, కట్టుగూడెం గ్రామాల మధ్య రూ.40 లక్షల వ్యయంతో కల్వర్టు, ముకుందాపురం నుంచి ఒడ్డుగూడెం వరకు రూ.50లక్షల వ్యయంతో నిర్మించే బీటీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు టేకులపల్లి మండలం గోలియాతండాలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎంపీడీఓలు ధన్‌సింగ్, జి.రవీంద్రరావు, పీఆర్ డీఈ రాంకిషన్, ఏఈలు రాజు, నవీన్, యూనస్, ఎంపీఓలు చిరంజీవి, గణేష్, ఏపీఎం దుర్గారావు, సీఐ సురేష్, ఎస్ఐ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు పులి సైదులు, ఆరెం కిరణ్, చీమల నాగరత్నమ్మ, మండల రాము, మహేష్, పూనెం సురేందర్, తాటి రాంబాబు, తాటి యశోద, పాయం కృష్ణప్రసాద్, బానోత్ రాంబాబు, మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, తాటి భిక్షం, బానోత్ శారద, భార్గవ్ లలిత, ఆనంద్, దేవానాయక్, కోరం సురేందర్, బండ్ల రజిని, బోడ నిరోషా, బోడ సరిత, ఇస్లావత్ రెడ్యానాయక్, బోడ మంగీలాల్, మధురెడ్డి, గణేష్ పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభకు తరలిరండి..



ఇల్లెందు: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: పీడీఎస్‌యూ 50 వసంతాల స్వర్ణోత్సవ సభను ఈ నెల 24న హైదరాబాద్‌లోని ఉస్మానియా ఠాగూర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఇర్ప రాజేష్ తెలిపారు. బుధవారం ఇల్లెందు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టర్లు ఆవిష్కరించారు. పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఏళ్లు నిండిన సందర్భంగా ఉద్యమాలను, అమరవీరులను స్మరణకు తెచ్చుకోవాలన్నారు. కీలక నేతలైన జార్జిరెడ్డి మతోన్మాదుల చేతిలో హత్యకు గురి కాగా, జంపాల చంద్రశేఖరప్రసాద్, శ్రీపాదశ్రీహరి పోలీస్ ఎన్‌కౌంటర్లలో హతమయ్యారని పేర్కొన్నారు. వీరితో పాటు కోలా శంకర్, చేరాలు, రంగవల్లి, స్నేహలత, మారోజు వీరన్న, మధుసూదన్‌రాజు, వీరారెడ్డి, రమణయ్య, సాంబన్న లాంటి ఎందరో మంది అమరులయినట్లు తెలిపారు. త్యాగాల చరిత్ర కలిగిన పీడీఎస్‌యూ ఉద్యమాన్ని సమీక్షించుకునేందుకు జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు.

టేకులపల్లి: 25న వరంగల్లో జరగనున్న పీడీఎస్‌యూ 50 ఏళ్ల పోరాట స్ఫూర్తి సభను విజయవంతం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ.. అక్టోబర్ 12 నాటికి పీడీఎస్‌యూ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు. ఈ సభకు విద్యార్థులు, మేధావులు, విద్యావంతులు, అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. భరత్, అరుణ్, మౌనిక, సంధ్య పాల్గొన్నారు.

బాణాసంచా దుకాణాలకు 14 దరఖాస్తులు

పాల్వంచరూరల్: దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణాల ఏర్పాటుకు 14 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ వివేక్ బుధవారం తెలిపారు. వీటిని ఆర్డీఓకు పంపించడం జరిగిందని, పోలీసు, ఫైర్, మున్సిపాలిటీ శాఖల అనుమతులు ఉంటే నిబంధనల ప్రకారం అనుమతులు ఇస్తామని పేర్కొన్నారు.

సేఫ్టీ నిబంధనలు పాటించండి..



దుకాణదారులతో డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు: దీపావళి సందర్భంగా బాణాసంచా దుకాణదారులు సేఫ్టీ నిబంధనలు పాటించాలని డీఎస్పీ చంద్రభాను సూచించారు. బుధవారం ఇల్లెందు పోలీస్ స్టేషన్‌లో ఇల్లెందు, టేకులపల్లిలో బాణాసంచా దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఫైర్ సేఫ్టీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కాలేజీ ఫీజు వాపసు ఇవ్వండి..



ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న శివశంకర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి ఉమెన్స్ జూనియర్ కాలేజీలో నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులను విద్యార్థులకు వాపసు ఇవ్వాలని, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్ కోరారు. ఈ మేరకు బుధవారం సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. శివశంకర్ మాట్లాడుతూ.. సింగరేణి ఉమెన్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫీజ మొదటి సంవత్సరం ఏడువేలు, రెండో సంవత్సరం ఏడు వేలు విద్యార్థులు చెల్లించారు. 2008లో అప్పటి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్. పథకం మంజూరు చేసింది. అవి తిరిగి విద్యార్థులకు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కాలయాపన సరికాదు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఫహీమ్‌దాదా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని విమర్శించారు. దీనితో విద్యార్థుల చదువులు సాగేదెలా అని ప్రశ్నించారు. మూడేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల లేక విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఇబ్బందులు, సిబ్బందికి వేతనాలు, భవన కిరాయిలు ఇవ్వలేక ప్రైవేట్ డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు నాలుగు రోజులు బంద్ చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. గత ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేసిందని కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకేసారి విడుదల చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చి పదినెలలు కావొస్తున్నా ఇప్పటికీ విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు.

విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి నిధులు కేటాయించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలకు నిధులు విడుదల చేస్తున్న ప్రభుత్వం విద్యార్థుల బకాయిలు చెల్లించడంలో ఆలోచించడం సరికాదన్నారు. పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేదంటే ఆందోళనా కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈనెల 27లోగా బకాయిలు చెల్లించకపోతే చలో ఇందిరాపార్క్ నిర్వహించి హైదరాబాద్‌ను దిగ్బంధనం చేస్తామన్నారు. అనంతరం విద్యాశాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అజిత్, షాహిద్, గుగులోత్ వంశీ, పవన్‌సాయి, హృజన్, బానోత్ శ్రీను, వినయ్ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

మానసిక క్షోభ పెడుతున్నారు..



చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కొత్తగూడెంఅర్బన్: అధిక ఫీజులతో ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసిక క్షోభకు గురిచేస్తున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ మండిపడ్డారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సుమిత్రా దేవి, లాయర్ సాధిక్ పాషాకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యను వ్యాపారం చేస్తూ కొన్ని విద్యాసంస్థలు సాధారణ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయని ధ్వజమెత్తారు. ఇష్టానుసారంగా దోచుకుంటున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పాలు అనుమానాలకు తావిస్తోందన్నారు. నిరంతర పర్యవేక్షణ లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు విచ్చలవిడిగా ఫీజులు దండుకోవడమే కాకుండా కనీస నిబంధనలను పాటించడం లేదని విమర్శించారు. విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 25 శాతం సీట్లను ఉచితంగా ఇవ్వాలనే నిబంధనలను ఏ ఒక్క పాఠశాల యాజమాన్యం పాటించడం లేదని ఆరోపించారు. 14 సంవత్సరాల లోపు పిల్లలను ఫీజుల పేరుతో ఇబ్బందులకు గురి చేయొద్దనే నిబంధన ఉన్నప్పటికీ కొత్తగూడెం నియోజకవర్గంలో మాత్రం అందుకు విరుద్ధంగా పిల్లలు ఫీజులు కట్టలేదని పరీక్షలకు కూడా అనుమతించడం లేదన్నారు. కొందరు తోటి విద్యార్థుల ముందు అవమానాలకు గురవుతూ పాఠశాలకు వెళ్లేందుకు జంకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఎఫ్ఏ-వన్ పరీక్షలకు అనుమతించకుండా బ్లాక్ మెయిల్ పాల్పడడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు.

విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, మాలోత్ వీరునాయక్, సాయి, నాగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాల ఆక్రమణలపై నోటీసులు

టేకులపల్లి: పార్కింగ్ స్థలాలు ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ గడదాసు రవీంద్రరావు, ఎంపీఓ జేఎల్ గాంధీ, కార్యదర్శి ఉప్పు దీప్తి మండల కేంద్రంలో పార్కింగ్ స్థలాలు అక్రమించి, కాలువలు దాటి వ్యాపారాలు చేస్తున్న దుకాణాలను పరిశీలించి వారికి నోటీసులు ఇచ్చారు. మాట్లాడుతూ.. పార్కింగ్ స్థలాలు ఆక్రమించి వ్యాపారాలు చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ఇదిలా ఉండగా ఏడాదిగా పలుమార్లు నోటీసులు ఇచ్చినా, పోలీసులు హెచ్చరించినా ఎలాంటి మార్పు రాలేదు. యథేచ్ఛగా వ్యాపారాలు కొనసాగుతూనే ఉన్నాయి.

అటెన్షన్ ప్లీజ్



బురద గుంత కనిపిస్తోందా?



మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల గేటు వద్ద బురద గుంత విద్యార్థులు, ఉపాధ్యాయులకు అసౌకర్యంగా తుంది. పరిసరాలతో పాటు పాఠశాలల్లోనూ పరిశుభ్రత బాధ్యత గ్రామ పంచాయతీలదే. ప్రధాన రహదారి పక్కనే ఉన్న స్కూల్ గేటు వద్ద పెద్ద బురద గుంత ఏర్పడినా పంచాయతీ అధికారులకు కనిపించకపోవడం గమనార్హం. ఈ పాఠశాలలో దాదాపు రెండు వందల మంది విద్యార్థులు ఈ బురత గుంతను మీదుగా వచ్చిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. - టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: ప్రశాంత్
గోలియా తండా పంచాయతీ కార్యదర్శి
ఫోన్ నంబర్: 8106602112

సింగరేణిలో అన్‌ఫిట్ దందా ఆగేనా?



సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో మెడికల్ బోర్డ్‌కు హాజరైన కార్మికులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఏళ్లుగా మెడికల్ బోర్డ్ దందా అధికారుల సమన్వయంతో మూడు పువ్వులు, ఆరుకాయల్లా సాగుతోంది. దీనికి చెక్ పెట్టటానికి యాజమాన్యం అనేక ప్రయత్నాలు చేస్తోంది. అయినా కూకటివేళ్లతో పాతుకుపోయిన ఈ దందాను ఆపటం ఎవరితరం కాదనే ప్రచారం జరుగుతోంది. ఈ ప్రక్రియలో గనుల మీద వెల్ఫేర్ సెక్షన్ నుంచి సింగరేణి భవన్, కార్పొరేట్ కార్యాయలం, సింగరేణి మెయిన్ ఆస్పత్రుల్లో కొంతమంది అధికారులు, సిబ్బంది హస్తం ఉందనే ప్రచారం సింగరేణి వ్యాప్తంగా గుసగుసలాడుతున్నారు. ఈ దందాలో అధికారులకు ఉండే చానల్ అధికారులకు, సిబ్బంది ఉండే చానల్ సిబ్బందికి ఉంది. కొంతమంది ప్రజాప్రతినిధులకు నేరుగా మెడికల్ డైరెక్టర్ కార్యాలయం నుంచే సంబంధాలు ఉన్నాయి. అందరి లక్ష్యం ఒకటే తమ క్యాండెట్ మెడికల్ ఇన్‌వాలిడేషన్ అవటం.

ఏసీబీ, సీబీఐతో కట్టడి కాని దందా నజరానాతో అయ్యేనా..

సింగరేణి సీఎండీ తన పరిపాలన సజావుగా సాగటానికి, తనపై ఎటువంటి మచ్చ పడకుండా ఉండటానికి ఇటీవల మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియను ఏసీబీ, సీబీఐ విభాగాలతో విచారణ చేయించారు. వీరు కొంతమంది దళారుల వివరాలు సేకరించి వారిని విచారించిన క్రమంలో ఏదీ వెలుగులోకి రాని కారణంగా తాజాగా మెడికల్ ఇన్‌వాలిడేషన్ దళారుల వివరాలు తెలిపితే రూ.10 వేల నజరానా ఇస్తామని ప్రకటించారు. ఈ ప్రకటన ద్వారా దళారుల వివారాలు తెలిపే అవకాశం ఉందా..? ఒకవేళ ఉంటే సింగరేణి విజిలెన్స్ వారిని గుర్తించి చర్యలు చేపడుతుందా అని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ బోర్డ్ దందాను అరికట్టటంలో విజిలెన్స్ విభాగం పూర్తిగా ఫెయిల్ అయిందని, ఈ విభాగం కేవలం అలంకార ప్రాయమైందనే కార్మికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సింగరేణిలో జరిగిన కొన్ని రిక్రూమెంట్‌లలో అనేక అవకతవకలు జరిగినా సింగరేణి విజిలెన్స్ ఎవరినీ గుర్తించలేకపోయిందని, ఎవరిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవటంతో పాటు, కేవలం కార్మికులను వేధించేదుకేనని విమర్శలు వస్తున్నాయి.

నేడు, రేపు మెడికల్ బోర్డ్..

కొత్తగూడెంలోని సింగరేణి ప్రధానాస్పత్రిలో 24, 25 తేదీలలో కార్పొరేట్ మెడికల్ బోర్డ్ జరుగనుంది. మొదటి రోజు ప్రీబోర్డ్, రెండో రోజు రిపోర్ట్‌ల ప్రకారం కార్మికులకు అన్‌ఫిట్ చేస్తారు. ఈ మెడికల్ బోర్డ్‌కు సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల నుంచి కార్మికులకు హాజరుకానున్నారు.